



దీపావళి కథల పోటీలో
పాఠకుల నిర్ణయానికై ఎంపిక చేసిన కథ

# 'నలుపు'లో 'తెలుపు'

ఆకాశగంగ

భూలోకగంగ

పాతాళగంగ

ముత్రోవద్రిమ్మరిగా... లోకపావనిగ బిరుదుపొందినగంగ.

మనుషుల పాపాలను మోసి... మోసీ! 'పోలియో' వ్యాధిసోకిన స్త్రీ నడచినట్లు 'నది'లో సాగుతూ ఉంది.

నగరజీవితంలో.

మనుషుల మధ్యలో!..... విశ్రాంతి కోల్పోయిన దేవుడు నడిఒడ్డున, కొత్తగా వెలసిన గుడిలోనైనా ప్రశాంతంగా బతుకుదాంలే! అనుకున్నాడు.

ఇంతడబ్బు వసూలుచేసీ!

ఇంతపెద్ద గుడి కట్టింది ఎందుకూ?... మా పాపాలన్నీ మోస్తావనేగదా!" - అనుకున్న జనం అక్కడకూడా దేవునికి విశ్రాంతి లేకుండా చేస్తున్నారు. 'భక్తి' పేరుతో తమ కష్టాలన్నీ ఏకరువు పెడుతున్నారు.

పాపం!.... దేవుడు.

భక్తి ముందు తన శక్తిని కోల్పోయి స్తబ్ధంగా ఉండిపోయాడు.

'నది' ఒడ్డున.

'గుడి'-కి అల్లంత దూరంలో.

తైలసంస్కారం లేని జుత్తులాగా, చెత్తాచెదారంతో, ప్లాస్టిక్ పేపర్లతో నిర్మించబడిన కొన్ని 'గుడిసెలు'.

జన్మజన్మల 'ఖర్మ' వల్లనో!... 'విధి'కి కోపమొచ్చి కాళ్ళూచేతులు నరకటం వల్లనో.... 'సూది' కొసలకు పదనుబెట్టి కళ్ళల్లో పొడవటం వల్లనో!.... ఏకారణం చేతనో!.... అవిటి - బతుకులుకొన్ని ఆ గుడిసెల్లో కాపురం చేస్తున్నాయి. కడుపులో 'ఉరుము'లాగా,అరిచే పేగుల కోపాన్ని చల్లార్చటం కోసం బతుకువేటలో అలసిపోయిన అవిటివాళ్ళు, రాత్రికాగానే గుడిసెల్లో చేరి గాఢనిద్రలోకి జారుకుంటారు.

కోడికూత.

ఫ్యాక్టరీసైరన్.

నది ఎదపై అడ్డంగా కట్టిన వంతెనపై పరుగెట్టే 'రైలు' శబ్దాలు వాళ్ళ నిద్రకు భంగం కలిగించవు. గుడిలో దేవున్ని మేల్కొల్పే సుప్రభాతం. 'జనగణమన' లాగా గణగణమని మ్రోగే గుడిగంటలు ఆ బతుకుల గడియారాలకు అలారాలు. ఆనాదం వినగానే అవిటివాళ్ళు నిద్రలేస్తారు. తట్టా, బొచ్చా, జోలే, గలి తీసుకుంటారు. అవయవాల సహకార శక్తినిబట్టీ... మెలుకువలు పాటించి నదిలోకి దిగుతారు. 'పాపనాశని' గంగను నోట్లో పుక్కిలించి ఊస్తారు. అందిన తడితో ముఖం తుడుచుకొని 'అవిటి భిక్షగాళ్ళు' గుడిదగ్గరకు సాగిపోతారు.

"గుడిగంట్లు మోగతాండాయి!... ఇంగలెయ్యిపోదాం" అంది రంగి. "ఈ పొద్దు గూడానా!.... వద్దులే రంగీ" - తుంటకాళ్ళను డొక్కలోకి ముడుచుకుంటూ చెప్పాడు సింగన్న.

"బాగ సెప్పినావులే! ఈ పొద్దు బేస్తవారం(గురువారం) జనం శానామంది వత్తారు. కొన్ని పైసలు రాలేది ఈ దినమేగదా!.... కొంత పొద్దుగల్ల వద్దాంలే.... లెయ్.... లెయ్యా - అంటూ బతుకుతెరువు కోసం కావలసిన 'కానుల' అవసరం గురించి రంగి చెప్పగానే... సింగన్న చేతులు ఆపు చేసుకొని లేచి కూర్చున్నాడు. పడక పక్కనే ఉన్న రెండు 'ఊత కర్రలను' చేతికి తీసుకున్నాడు. సుత్తిలాగా ఒక పక్క ఎత్తుగా ఉన్న కర్రల నెత్తిని తన చంకల కిందికి దోపుకున్నాడు. కర్రల ఆపుతో లేచి నిలబడుకున్నాడు. రంగి ఏ సహాయమూ లేకుండా లేచింది. భర్త సింగన్న భుజం మీద చెయ్యి వేసింది. సింగన్న ముందు నడిచాడు. అతని అడుగుల్లో అడుగేసుకుంటూ రంగి కదిలింది. ఇద్దరూ నదిలోకి దిగారు. పల్చని వెలుతురులో, నది ఒడిలో సింగన్న కూర్చున్నాడు. సొట్టలు పడిన ప్లాస్టిక్ చెంబుతో నీళ్ళు ముంచింది రంగి. సింగన్న నెత్తిమీద పోసింది.

"అబ్బా!.... సల్లగుంతాయి రంగీ!... నీళ్ళు" - అంటూ ఒళ్ళు విదిలించాడు సింగన్న. "ఏట్లో నీళ్ళు సల్లగుండక... పొంతలో నీళ్ళు మాదిరి యచ్చగుంటాయా!... ఏంది" - భర్త కదలికలను 'స్పర్శ' ద్వారా చూస్తూ 'కిలకిలా' నవ్వింది రంగి.

రంగి చేతిలో ఉన్న చెంబును ఒడువుగా లాక్కున్నాడు సింగన్న.

'నీళ్ళు - ముంచి ముంచి భార్య నెత్తి మీద పోశాడు... నీళ్ళ పలకరింపుకు ఉలిక్కి పడుతూ "ఔగదయ్యా!.... శాలా సల్లగుండాయి నీళ్ళు" - అంది రంగి.

'గలగలా' నవ్వాడు సింగన్న. భర్త వీపును అరచేతులతో రుద్దింది రంగి. భార్య కురులకు సబ్బు పెట్టి తిక్కాడు సింగన్న. 'యవ్వన' మధురిమలు జలకాలాటలో కాసేపు సరసాలాడుకున్నాయి.

"అమ్మా! గంగమ్మ తల్లా!... వచ్చే జలమలోనైనా నాకు కాళ్ళు ఉండేటట్లు సూడు తల్లా"- అంటూ గంగలో మునిగాడు సింగన్న.

"తల్లా! గంగమ్మా! నా కండ్లు కూడా ఉండేటట్లు సూడుమాయమ్మా" - అంటూ నీళ్ళలో మునిగింది రంగి! - 'జలకేళి'లో ఇద్దరూ తమ అవిటితనాన్ని మరచిపోయారు. ఒడ్డుకు వచ్చారు. 'తడి'గుడ్డలు విడచి పొడి గుడ్డలు కట్టుకున్నారు.

సింగన్న - ముందు.

రంగి - వెనుక.

ఇద్దరూ గుడిమెట్లు చేరుకునే సరికి సూర్యుడు నిద్రలేచాడు. గుడిమెట్లకు పక్కగా ఉన్న స్థలం అప్పటికే నిండిపోయింది. రంగి చిట్టచివరి మెట్టుకింద నేల మీద కూర్చుంది. సిల్వర్ తట్ట చేతుల్లో పట్టుకుంది!.... మెట్లకు కొంతదూరంలో, గుడికి ఎదురుగా అడ్డంగా ఉన్న తారు రోడ్డును ఒంటి మీద వున్న తుంట గుడ్డతో శుభ్రం చేశాడు సింగన్న. రంగుల



గుంటూరులో రాష్ట్ర సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో జరిగిన 'సరస కవితా మహోత్సవానికి సమన్వయ కర్తగా వ్యవహరించిన ప్రముఖ విమర్శకులు డా॥ ద్వా.నా. శాస్త్రిని సత్కరిస్తున్న సాంస్కృతిక మండలి అధ్యక్షులు డా॥ ధర్మవరపు సుబ్రహ్మణ్యం.

చాక్‌పీస్‌లతో "షిర్డీ సాయిబాబా" బొమ్మను గీశాడు. "మతాతీతం, కులాతీతం, మానవతకు ప్రతిరూపం" – అయిన షిర్డీ సాయి రూపం సింగన్న గీసిన బొమ్మలో ప్రాణం పోసుకుంది. సింగన్న కూడా మెట్ల చివర కొచ్చి, బొచ్చె చేతిలో పట్టుకుని రంగికి ఎదురుగా ఒక పక్క కూర్చున్నాడు.

"అమ్మా!.... తల్లా!.... అయ్యా!... బాబూ! కళ్ళులేని కబోజిని తండ్రీ! కాళ్ళులేని అవిటోన్ని అమ్మా!... దానం సెయ్యండీ!... దరమం సెయ్యండీ!.... పిల్లాపాపల్తో సల్ల గుండండీ" – అంటూ మెట్లపై కూర్చున్న జనం హెచ్చు స్వరంతో అర్థిస్తున్నారు. రంగి కూడా పై స్థాయిలోనే అరుస్తోంది. ఆ అభాగ్యుల జీవితాలను చూసి కొందరు కరుగుతున్నారు. అర్థరూపాయో!... రూపాయో! కొబ్బరి ముక్కో! ... ప్రసాదమో!... ఏదో ఒకటి ఇస్తున్నారు. కొందరు 'వాళ్ళకు కాళ్ళొచ్చినట్లు' వెళ్ళి పోతున్నారు.

'రంగి' – తట్టలో 'నాణెం' గజ్జెల నాదంతో శబ్దం చేస్తున్నప్పుడల్లా ఆమె పక్కన ఉన్న జనం ఈర్ష్యతో, మాటలకు పదును పెడుతూ ... "ఇది గుడ్డిదైనా! దీని వద్ద దుడ్డు దండి గుండాది. దీని మొగుడు కూడా బాగా సంపాదిత్తాండాడు. అదిగదిగో! ఆ సింగడే దీని మొగుడు. దీని కొద్దులేతల్లా!... దీనికి వద్దులే నాయనా! నాకెయ్యండి. దిక్కులేనిదాన్ని. ముసిలిదాన్ని, అవిటిదాన్ని" – అంటూ తట్ట ఎగరేస్తూ రంగి సహచరులు మాట్లాడినప్పుడల్లా రంగికి కోపమొస్తోంది.

"ఏందే! ముసిలిముండా! నీమొగిని సొమ్మేమన్నా నాకిత్తాండావా!... ఏందిరా! ముసిలినాకొడకా! నీయబ్బగంటేమన్నా ఇత్తాండావా?" – అంటూ నోట్లో ఉన్న తిట్లబుట్టను గుమ్మరిస్తోంది రంగి. రంగి నోటిధాటికి తట్టుకోలేకా..." గయ్యాలి ముండ! ఒగటి అంటే నాలుగంటుంది. దీంతో పోట్లాడి మేమ్యాడ గెలుత్తాం" – అనుకుంటూ రంగి శత్రువర్గం తోకముడుచుకుంటోంది.

'సింగన్న' – సంగతి కూడా ఇంతే. అతని నొక్కులు పడిన తట్టలో కూడా 'లక్ష్మీ' కులికినప్పుడు, అక్కడ ఉన్న జనం "ఈడు కుంటోడే అయినా! శానా తెలివి మంతుడు. అద్దో! సూడండి. ఆ బాబా బొమ్మ గీసింది ఈడే. అక్కడా!.... ఇక్కడా! రొండుపక్కలా లెక్క (డబ్బు) గుంజుతాండాడు. ఈడి పెండ్లాం గూడా సంపాదిత్తాండాది. ఈడి కెయ్యద్దండి తల్లా!... నాకెయ్యండమ్మా. నాకెయ్యి తండ్రీ! ఒగరూపాయి" – అంటూ 'కాకి' అరుపులు నోట్లో పోసుకొని సింగన్నతోటివాళ్ళు గోలగోల చేస్తున్నారు.

'ధనం' – అవసరాన్నీ;

'అసూయ' – అవిటితన్నాన్నీ – గొంతులో పోసుకొని, తన బతుక్కి అడ్డువస్తున్న సహభిక్షగాళ్ళ ఓర్వలేనితనాన్ని చూసి సింగన్నకు కూడా కోపమొస్తోంది. రంగిలాగే సింగన్న మాటకు కూడా ఘాటు ఉండడంతో సింగన్న సహాధ్యాయులు కూడా వెనక్కి తగ్గుతున్నారు. అవిటి భిక్షగాళ్ళు 'పైసా' కోసం అలా పోట్లాడుకోవడం చూసీ! "బతుకు బాటలో పోరాటం లేందెక్కడా?" – అనుకుంటూ గుడికొచ్చిన జనం పోతున్నారు.

గుడిలో దేవుడు 'భక్తికి బంధీ' కావడం వల్ల కదలక – మెదలక కూర్చున్నాడు.

గగనకాంత నుదిటికి సూర్యుడు బొట్టులాగా ఉన్నాడు.

మిట్టమధ్యాహ్నం కావటంతో గుడిలో రద్దీ తగ్గింది. మెట్లు ఎక్కేజనం, ... దిగేజనం అదృశ్యమైనారు. మెట్లకు ఇరువైపులా కూర్చున్న భిక్షగాళ్ళకు తీరిక దొరకడంతో కాట్లాడుకోవడం మానేసి మాట్లాడుకోవడం ప్రారంభించారు.

"ఏందే! రంగీ!... దొరసాని మాదిరి ఇంత పొద్దెక్కినాకవొత్తివి" – అంతవరకూ పోట్లాడిన 'ఎరుకలమ్మ' వక్కా సంచిలో వున్న తమలపాకును చేతిలోకి తీసుకుంటూ అడిగింది.

ఏంలేదత్తా! ఈ పొద్దు సింగన్న నా మెడలో తాళిబొట్టు కట్టిన దినం. ఏట్లో సానం సేసీ! .... వచ్చే జలమలోనైనా నాకు కండ్లీ తల్లా! అని మొక్కొనొత్తి. దానికే కొంత పొద్దు పోయింది. నాముత్తైదుతనం సల్లగుండాలని దీవించు" – అంటూ అంతకు ముందు క్షణం వరకు తిట్టిపోసిన రంగి, .... ఎరుకలమ్మ పాదాలను స్పృశించింది.

"నా తల్లే! .... నాయమ్మే! పెద్దోళ్ళంటే యంత గోరమేనీకూ!... నూరేండ్లు బిడ్డాపాపల్తో సల్లగుండు నాయనా"... అంటూ ఆశీర్వదించింది ఎరుకలమ్మ. ఈ వక్క ఇట్లా ఉంటే!.... అపక్క ఉన్న సింగన్నతో... "ఏరా! సింగడూ! మారాజుమాదిరి వత్తివి?..... నీకేంప్పా! దిక్కల దిక్కలా ఆదాయమే. నాలుగు సేతుల్తో సంపాదిత్తాండవు. నీపెండ్లాం సంపాదించా! ... నువ్వు గీసిన బొమ్మ సంపాదించా!.... ఈడ కూకోని నువ్వు సంపాదిత్తాం డావు. అద్రుట్టమంటే నీదేసూడు" – తెగిన చెయ్యిని తడుముకుంటూ, ఎత్తి పొడుపులో నత్తినత్తిగా మానవ మనస్తత్వాన్ని కలుపుకొని అడిగాడు సిద్ధప్ప.

"ఏంది పెద్దయ్యా! అట్లంటావూ! మా పెండ్లి పెద్దవు నువ్వే మర్సిపోతే ఎట్లా? ఈపొద్దు మా పెండ్లిరోజు. 'రంగీ-నేనూ' మనువాడిన దినం. మా పాపాలు పోగొట్టమనీ నీళ్ళల్లో మునిగి గంగమ్మతల్లిని అడిగొత్తిమి. దానికే లేట్ అయింది" – దీవించు అంటూ తలవొంచాడు సింగన్న.

"ఓరే.... ఓరే! మర్సిపోయినాండ్రోయ్! అప్పుడే యాడాది గడిసిపోయింది. సల్లగుండు బిడ్డా! బారియా బిడ్డలతో నూరేండ్లు సక్కగా బతుకు" – అంటూ సింగన్న నెత్తిని ప్రేమతో నిమిరాడు సిద్ధప్ప. ఉదయం నుంచి కోట్లాడిన సంగతంతా మరచిపోయి.

'రంగి-సింగన్న'ల పెళ్ళి ఎలా జరిగిందో! అక్కడున్న అవిటివాళ్ళందరూ గుర్తుచేసుకున్నారు. "యామైనా!.... సింగడు... సింగడే! శానాగట్టోడు. అనుకున్న కార్యం నెరవేర్చే వరకూ నిద్రపోలేదు" – అని సిద్ధప్ప అన్నాడు. "రంగేమి తక్కువా! తన మాట నెగ్గించుకుంది. సింగన్న బతుకులో దీపమై యలగుతా ఉండాది" – సిద్ధప్ప మాటకు ధీటుగా చెప్పింది ఎరుకలమ్మ.

రంగి – స్థితప్రజ్ఞతనూ, ముందు చూపునూ కొందరు మెచ్చుకున్నారు.

సింగన్న – కార్యదక్షతనూ, పట్టుదలనూ మరికొందరు గొప్ప చేసి చెప్పారు.

'షిర్డీ సాయిబాబా' గుడిమెట్లు విక్రమార్క మహారాజు సింహాసనానికున్న మెట్లయి నాయి. మెట్లమీద ఇరుపక్కలా కూర్చున్న అవిటి

భిక్షగాళ్ళు సాలభంజికలైనారు. 'సింగన్న – రంగి' దంపతులుగా మారిన వైనం వాళ్ళ మాటలకు కథా వస్తువైంది.

నగరంలో 'శైవం' ఉంది. శివాలయా లున్నాయి.

✿ ✿ ✿

'వైష్ణవం' ఉంది. అందుకు సంబంధించిన దేవుళ్ళ రూపాలకు గుళ్ళున్నాయి. బతుకులో మార్పులు వచ్చినట్లే!... జనం 'భక్తి'లో కూడా మార్పులు వచ్చాయి. 'నమ్మకం' – పునాదిపైన నిర్మించబడిన భక్తి. షిర్డీ సాయిబాబా ఆలయాన్ని కూడా నిర్మించింది. కొత్త దేవుడు చాలామందికి ఇష్టుడైనాడు. పాతగుళ్ళ దగ్గర అడుక్కుంటున్న అవిటివాళ్ళు ఉదర పోషణకు సంపాదన తగ్గింది. వలస పక్షులు పచ్చగున్నచోటుకు తరలివెళ్ళినట్లు, అవిటి భిక్షగాళ్ళు 'బాబాగుడి' చేరుకున్నారు. పాతగుళ్ళ దగ్గర అడుక్కుంటున్నప్పుడు రంగిపై సింగన్నకు ఏ భావమూ లేదు. కొత్తగుడి దగ్గర చేరిన కొన్నాళ్ళకు 'తోడు'కోసం సింగన్న ఆరాటపడినాడు. కాళ్ళులేని తనను రంగి కాళ్ళు నడిపిస్తాయనుకున్నాడు. 'కళ్ళు'లేని రంగికి తన కళ్ళు ద్వారా వెలుగు చూపాలనుకున్నాడు. సినిమాల్లోలాగా దొంగచూపులూ, ఓరచూపులూ అన్యోక్తులూ, ఛలోక్తులూ, పిచ్చిపిచ్చి మాటలతో కాలయాపన చెయ్యకుండా...

"రంగీ!.... నువ్వంటే నాకిష్టం. నువ్వు 'ఊ' అంటే నీమెళ్ళో తాళిబొట్టు కడతా" – అని సూటిగా చెప్పాడు సింగన్న.

"ఊహూ' – అంటే!.... సత్తావా" అంది రంగి ఘాటుగా.

"శా.... శా! నేను సచ్చేదాకా... నిన్ను సూత్తూనే ఉంటా" – అన్నారు సింగన్న.

"అవిటి బతుకుల్తో సచ్చి బతకతాండాం. సావల్యేక బతకతాండాం. ఈ బతుక్కి ఇంగ పెండ్లొగటే తక్కువ. నోరు మూసుకో" – అని సున్నితంగా, కాసింత కటువుగా మందలించింది రంగి. ఆమె గుండెల్లో పొంగిన వేదన, మాటల్లో కనిపించిన సున్నితత్వం, రూపంలో ఉన్న సౌకుమార్యం సింగన్నను మరింత ఆకర్షించాయి. "అదేంటి రంగీ! అంత ఎగుటుగా మాట్లాడుతావూ! అవిటివాళ్ళు మనువాడకూడదని ఆదేవుడు సెప్పినాడా!.... పిల్లల్ని కనకూడదని శాపం పెట్టినాడా?.... సీమలూ, దోమల్లో కూడా సృష్టికార్యం జరుగుతున్నప్పుడు, మనుసులమైన మనకేంటికి ఉండకూడదూ" – ప్రకృతి ధర్మాన్ని నర్మగర్భంగా చెప్పాడు' సింగన్న. "ఈ గుడ్డి బతుక్కి మల్లా పిల్లలు గూడానా? .... నీ పని నువ్వు సూసుకో! నా జోలికి రావద్దు" – ఇష్టా యిష్టాలతో మంతనాలు జరిపీ, ... ఇష్టతలోనే అయిష్టతను ప్రకటించింది రంగి.

"సింగన్న – అడగటం, ... రంగి ఔననటంలో కాదనటాన్ని కాలం కాస్త ముందుకు తీసుకెళ్ళింది".

✿ ✿ ✿

గురువారం.

'నలుపు – తెలుపు' కలపోతగా వేకువ.

గుడి తొలిమెట్లపై కూర్చోవటానికి 'నువ్వా – నేనా'! అన్నట్లు అవిటివాళ్ళు పోటీ పడుతున్నారు. కళ్ళల్లో లేని బలం... కాళ్ళల్లో చూపిస్తూ రంగి గుడిమెట్లు ఎక్కుతూ ఉంది.

కాళ్ళు లేని సింగన్న పోటీలో పాల్గొనలేక అతికష్టం మీద మెట్ల మధ్యకు చేరుకున్నాడు.

'మనోబలం'తో ముందుకురుకుతున్న రంగి ... రెండు మెట్లు ఒకేసారి దాటటానికి ప్రయత్నించింది. గురి తప్పింది. పొర్లుకుంటూ క్రిందికి రాసాగింది. చూశాడు సింగన్న కూర్చున్నవాడు ఉన్నపాటున మెట్లపైన అడ్డంగా పడుకున్నాడు. రంగి దొర్లుకుంటూ వచ్చి సింగన్న ఎదమీద పడింది. పొర్లటం ఆగి పోయింది. రంగి...సింగన్న ఎదమీద కుదురుగానిలబడింది.

ఏదో! .... కొత్తదనం.

తెలియని ఆనందం... ఇరువురి స్పర్శల్లో కొలువుదీరింది. సిగ్గుల్లో మొగ్గలు పూయిస్తూ రంగి త్వరగా లేచికూర్చుంది. సింగన్న లేవటానికి చెయ్యి అందించింది. మెట్ల పక్కకు ఇద్దరూ జరిగి కూర్చున్నారు.

"దెబ్బతగిలిందా రంగీ"

"లేదులే! సింగన్నా" – ఇద్దరి మాటల్లో "మోహనరాగం" తియ్యగా పలికింది.

"సెప్పు రంగీ!... నేనంటే నీకిట్టమేనా"

"నేను ఇట్టపడాలంటే నువ్వాగిటి సెయ్యాల".

"నేను కట్టెలతో నడిసినా!.... నువ్వు అడిగితే భుజాలమీద ఎత్తుకొని నడుత్తా... ఏమిసెయ్యాల్నో సెప్పు"... అన్నాడు సింగడు. ఫక్కుననవ్వింది రంగి. గట్టిగా నవ్వాడు సింగన్న.

"నడిసే బలం నీకున్నా!... ఎక్కి కూసోవడం నాకిట్టంలేదు. ఎత్తుకెదగల్ల" – అంది రంగి.

"ఇప్పుడు మనకేమైంది రంగీ!.... నువ్వూ సంపాదిత్తాండావూ! నేనూ సంపాదిత్తాండా" – ధీమాగా చెప్పాడు సింగన్న.

"ఇది మనం తినటానికే సాల్దు. మనకు పుట్టే పిల్లోళ్ళకు ఏంపెడతాం. వాళ్ళు కూడా


సమస్యల్లో ఉన్న స్త్రీల కోసం

**భూమిక హెల్ప్‌లైన్**

(కేవలం ఫోన్ ద్వారానే)

సలహా, సమాచారం కోసం సంప్రదించండి

టోల్ ఫ్రీ నెంబర్

1800 425 2908



మీ వివరాలను గోప్యంగా ఉంచడం మా బాధ్యత

Our cause is supported by OXFAM

మన మాదిరే అడుక్కోవాల్నా" - తనకు తట్టని ఆలోచన రంగి బుర్రలో మెరిసినందుకు సింగన్న సంతోషపడ్డాడు. రంగి ముందు చూపులో ఉన్న బతుకును గ్రహించి ఆనందించాడు. అంతలోనే నిరాశ మనసును ముసురుకోవటంతో .... "మల్లనన్నేమి సెయ్యిమంటావు రంగీ! గొంతు సించుకొని అరత్తానే ఉండా గదా!.... నీకు కండ్లులేవు గాబట్టీ!... ఆడపిల్లవు గాబట్టీ జనం నీపైన ఎక్కువ 'దయ' సూపతాండారు. నేను కండ్లు పొడుసుకుంటాలే! కండ్లూ కాళ్లూ లేని నాపై జనం జాలిచూపిత్తారు". ఇరిగిన కాళ్ళను చేతులతో తడుంకుంటూ కళ్ళను 'తడి' చేసు కున్నాడు సింగన్న.

రంగికి కోపమొచ్చింది.

అసహ్యమేసింది.

"సీ!.. సీ!.. సీసీ!.. - ఇంగోసారి ఆమాటలంటే నీతో ఈ జలమలో మాట్లాడను. సూపులేని అందులకోసం ... కండ్లు దానం సెయ్యండి ... మరణంల్యాకుండా బతకండీ! - అని వైద్యులు .... పెబుత్వంవాళ్ళూ సెవిలో ఇల్లు గట్టుకొని అందరికి సెప్పుతాంటే, ఉన్న సూపును నాకోసరం పోగొట్టుకుంటానంటావా! ... నువ్వూ ఒగమడిసివేనా! తెలివి ఉంటే సాలు. తెలివిగా పనులు సేత్తేసాలు. ఒగర్ని ఆసించకుండా బతకటానికి. నాలుగురాళ్ళు సంపాదించుకోవటానికి... ఇద్దో! సింగన్నా!.... నువ్వు నువ్వు సేసుకోవాలంటే ... నా కంటే నువ్వు ఎక్కువ సంపాదించాల"- ఇంకోమాటకు తావులేకుండా చెప్పి పక్కకు వచ్చి కూర్చుంది రంగి... "అమ్మా! .... అయ్యా!... కండ్లు లేని కబోజినమ్మా" - అంటూ తట్ట పైకెత్తింది. రూపాయి బిల్లలు రంగి తట్టలో ఘల్లుమన్నాయ్.

రంగి - స్థిరచిత్తం సింగన్న ఆలోచన లను కుదిపింది. ఆమె మాటల్లో 'వేకువ' కనిపించింది. సింగన్నలో పట్టుదలకు అంకు రార్పణ జరిగింది. బాల్యం గుర్తుకు వచ్చింది. ఆ చేష్ట కనిపించింది. ఆ చేష్టలోని 'గీతలు' తన అరచేతుల్లోని రేఖల్లాగా స్పష్టంగా అగుపించాయి. తన కుడి చెయ్యిని పదే!.... పదే చూసుకున్నాడు. చేతివేళ్ళను కళాత్మకంగా కదిలించాడు.

'సింగన్న' - కాళ్ళు బాగున్నప్పుడు ఉరికురికి తిరిగాడు. 'పొయ్యి' లోని 'బొగ్గు'లతో తెల్ల గోడలన్నీ నల్లగా చేశాడు. ఇంట్లో అమ్మా!... ఊర్లో జనం వెంటపడినప్పుడల్లా చిక్కకుండా పరుగెత్తాడు.పిచ్చిగీతల్లో తనకు నచ్చిన బొమ్మను చూసుకొని మురిసిపోయాడు. మొట్టమొదట 'అమ్మ' బొమ్మను గీశాడు. ఆ తర్వాత ఎన్నో బొమ్మలు కాని బొమ్మలు గీశాడు.

'బాల్యం' - కరిగిపోయింది.

'యవ్వనం' - రాసాగింది.

వనిపాటల్లో లీనమై పిచ్చిగీతలు మరచి పోయాడు. వనిలో అజాగ్రత్తగా ఉండడం వల్ల రెండు కాళ్ళూతుంటలైనాయి. అన్ని అవయవాలూ సరిగా ఉన్నా కూలిదొరకని రోజుల్లో అవిటితనం బతుక్కి 'నొప్పి' అనిపించింది. పల్లె విడచి పట్నం చేరుకున్నాడు సింగన్న. గుడిమెట్లు బతుక్కి దారిచూపాయి.

'గతం' - వచ్చి రెండు కన్నీటి బొట్లు రాల్చిపోయింది.

జారే కన్నీళ్ళను తుడుచుకున్నాడు సింగన్న ... బొగ్గుతో గీసిన 'నలుపు గీతల్లో .... తెలుపు" కనిపించింది. పలక కొనాలను కున్నాడు. బలపంతో పలకపైన బొమ్మలు గీయాలనుకున్నాడు. మరుసటిరోజే ఆ పని అమలుపరచాడు.

"పగలు - రాత్రులు" సింగన్న గీతల్లో కరిగిపోయాయి.

"ఏంట్రా!... సింగడూ! పిల్లకాయ మాద్రి తిక్కగీతలు గీత్తాండావు" - సిద్దప్ప అన్నాడు.

"ఎర్రి నాబట్ట! .... అడుక్కోకుండా ఏంటివో రాతలు రాత్తాండాడు. ఈ గీతలు గీసి నువ్వు లెక్కెప్పుడు సంపాదిత్తావు? రంగి నెప్పుడు పెండ్లి సేసుకుంటావు? ఏదో! ఒగిటి సేసీ రంగినీ - నిన్ను కలిపేత్తాంలే. ముడేత్తాంలే" - అంది ఎరుకలమ్మ.

"వద్దు! పెద్దమ్మా!.... నాసెక్తితోనే రంగిని మనువాడుతా" - గుండె ధైర్యంలో, నమ్మకంతో ధీమాగా అన్నాడు సింగన్న. సింగన్న వలకమీద గీస్తున్న 'చిత్రలేఖనం' చూసీ గుడికొచ్చిన జనంలో కొందరు "అబ్బో!... బాపూ వచ్చాడు" - అంటూ ఎగతాళి చేశారు. సింగన్న ఆమాటలు పట్టించుకోలేదు.

'కాలం' - తిరుగుతూ ఉంది. సింగన్న గీసిన బొమ్మలు పలుకుతూ వచ్చాయి. పలు కుతూ... పలుకుతూ ఫలితాన్నిచ్చాయి. గుడి ముందర, రోడ్డుమీద సజీవంగా నిలిచాయి. 'బొమ్మ'ను చూసిన జనం 'ఆహా!'... అన్నారు. సింగన్న చిత్రకళ బాపూబొమ్మకు వారసత్వంగా నిలిచింది. గుడికొచ్చిన జనం చిల్లరవేసి బొమ్మను పలకరించారు. రంగికి సంగతి తెలిసినా మౌనం గానే ఉంది. సింగన్న నోటినుంచే ఆ మాట వినాలని ముచ్చటపడింది.

చీకటి ముదురుతూ ఉంది.

గుడినుంచే - గుడిసెలకు వెళ్ళే తరుణం ఆసన్నమైంది.

చేతుల సహాయంతో రంగి దగ్గరకు నడుచుకుంటూ వచ్చాడు సింగన్న. "ఇద్దో! రంగీ. లెక్క ఎంచుకో! నువ్వు ఈపొద్దు సంపాదించిన దానికంటే ఎక్కువగా ఉందో! లేదో! సూసుకో" - అన్నాడు. ఆ మాటల్లో కొండలు పిండి చేసే టంత 'బలం', ప్రపంచాన్ని చుట్టివచ్చినంత ఆనందం ఉంది.

"అక్కర్లేదులే సింగన్నా!... నీమాటే సెబుతోంది. ఎప్పుడు నామెడలో తాళిబొట్టు కడతావూ" - ఆమె మాటల్లో బతుకుపై నమ్మకం తొణికిస లాడింది. రంగి మొఖంలో కొత్త అందం కనిపించింది సింగన్నకు. తాను గీసిన బొమ్మలాగుంది ఆ అందం.

'సిద్దప్ప'-పెళ్ళిపెద్దఅయినాడు.

'ఎరుకలమ్మ' - పెద్దముత్తైదువైంది.

తిథి, నక్షత్రాలతో సంబంధం లేకుండా!... వారం, వర్జ్యంతో బంధం కలపకుండా, షిర్డీ సాయిబాబా సమ క్షంలో, దేవునిసాక్షిగా రంగి - సింగన్న భార్యాభర్త లైనారు.

"ఏయ్!... పిల్లా! ఏందట్లా ఆలోసిత్తాం డావు. రేత్రికి మానోరు తీపి సెయ్యాల సూడు" - అని ఎరుకలమ్మ పలకరింపుతో గతం నుంచి వర్తమానంలోకి వచ్చింది రంగి... "రేయ్! సింగడూ!... రంగిని సూసింది ఇంగసాల్లేరా! మిగిలింది రేత్రికి సూసుకో" - అని సిద్దప్ప అనటంతో ఈ లోకంలోకి వచ్చాడు సింగన్న.

పొద్దవాలే సమయానికి కాస్త ముందు గానే గుడిమెట్లనుంచి ... భార్యాభర్తలిద్దరూ

నిష్క్రమించారు. గుడిసె దావపట్టేముందు, ఆరోజు సంపాదించిన డబ్బుతో 'పాయసానికి' కావలసిన సరుకులు కొనుక్కుంది రంగి. మూరెడు మల్లెపూలు తీసుకున్నాడు సింగన్న. చీకటి ముదరగానే అవిటి జనం 'గుడి' నుంచి గుడిసెల కొచ్చారు. అందరి నోళ్ళు 'తీపి' అయినాయి.

గుడిసెల్లో దీపాలన్నీ నిద్రపోయాయి.

ఒక్క గుడిసెలోని దీపం మాత్రం రంగి - సింగన్నలను చూస్తూ కూర్చుంది.

రంగి కొప్పులో మూరెడు మల్లెపూలు పెట్టాడు సింగన్న. వాళ్ళ పెదవుల్లాగే రంగి కొప్పులోని మల్లెలు కూడా నవ్వటం చూసి!... తృప్తిగా నిద్ర పోయింది దీపం... సింగన్న ఎదపై తలపెట్టి పడుకున్న రంగి...." "మామ" - అంది మంద్రస్వరంతో.

'ఊ' అన్నాడు సింగన్న అదేస్వరంతో.

"ఒగరి సానుబూతితో యన్నాల్లిట్లా బతుకుతాం!... బిచ్చగాళ్ళు... బిచ్చగాళ్ళని పిలిపించుకోకుండా సొంతంగా బతుకుదాం మామా".

"ఇప్పుడు మనం చేసేది అదేగదే! ఎవరి సొమ్ముకు పోతాండాం? .... మన కష్టం మీదే మనం బతుకుతాండాం!... అయినా నాకు తెలీక అడుగుతానూ బిచ్చగాళ్ళను... బిచ్చగాళ్ళనక... సావుకార్లంటారా ఏంది"?

"ఈ 'వుర్తి' ఇడిసిపెడదాం మామా! గుడికాడ బంకు పెట్టుకుందాం. బొమ్మల అంగడి పెట్టుకుందాం. సావుకార్లు కాకపోయినా!... ఒగర్ని 'యాసించకుండా' జీవిద్దాం.

సింగన్న కాసేపు మాటను కోల్పోయాడు. రంగి మాటల్లో ఉన్న స్వశక్తిని గ్రహించాడు. భవిష్యత్‌పై ఆమెకున్న 'ఆశ'ను గుర్తించాడు. భార్య మొఖాన్ని అభినందనతో కూడిన ప్రేమతో తడిమాడు. అంత చిమ్మ చీకటిలో ఆమె మొఖంలో ఉన్న తెలుపును చూశాడు. పెళ్ళి రోజు కానుకగా రంగి నుదిటి మీద రెండు ముద్దులు పెట్టాడు. గుండెలకేసి హత్తుకున్నాడు. తన కుడిచేతి వేళ్ళను కదలించాడు. వాటిని ఎంతో ఇష్టంగా పెదాలతో స్పృశించాడు.

✿ ✿ ✿

గుడికి కాస్త దూరంలో.

వేపచెట్టు నీడలో ఉన్న బంకులో!.... డ్రాయింగ్ షీట్‌పైన కుంచెతో బొమ్మలకు ప్రాణం పోస్తున్నాడు సింగన్న. అవసరమైన రంగులు సింగన్న అడిగినప్పుడు రంగి అందిస్తూ ఉంది. గుడికొచ్చిన జనం బొమ్మలు చూడటానికి కూడా వస్తున్నారు. "ఈ బొమ్మ ఎంత? ... ఆ ఆర్ట్ ఎంత?... అదిగదిగో అది ఎంత?" - ఇష్టమైన బొమ్మను కొనటానికి జనం అడుగుతున్నారు. అడిగిన బొమ్మను సింగన్న అమ్ముతున్నాడు. రంగి డబ్బులు తీసుకుంటూ ఉంది.

అమ్మా!.... తల్లా!... అయ్యా!.... బాబూ! ఒగ రూపాయి దానం సెయ్యండి. పుణ్యం కట్టుకోండీ" - అని ఒకప్పుడు పలికిన నోటితోనే ...." యా బొమ్మకావల్ల సారూ? .... ఈ బొమ్మ ఇమ్మంటరా మేడమూ" - అని సింగన్న ... రంగి అడుగుతున్నారు.

చిత్రకళతో!... స్వయంశక్తితో ఇష్టంగా బతుకుతున్న ఆ దంపతులు "హౌ!... వండ్రఫుల్ ఈజ్ ద ఆర్ట్" - అనే మాటలు ఒక విదేశస్తుని నోటి నుంచి రావటంతో ఉన్నపాటున అటువైపు చూశారు. ఆ మాటలు అర్థం కాకపోయినా!... అతను ఏ బొమ్మను చూసి అన్నాడో గ్రహించాడు సింగన్న.

"హౌ మచ్" - అన్నాడు విదేశస్తుడు నచ్చిన చిత్రకళవైపు చూపుడు వేలు చూపుతూ.

ఎంత చెప్పాలో తోచక, ఏం మాట్లాడాలో తట్టక,.. "ఈ బొమ్మా.... ఇదీ'' అంటూ మాటలకందని భావంతో ధర చెప్పటానికి సింగన్న ప్రయత్నిస్తూ ఉంటే; కళాభిమానంతో ఆత్రం, ఆనందం పట్టలేక...." ఐవిల్ గివ్ ట్వొంటీ థౌజెండ్" - అన్నాడు.

ఆంగ్లేయుడు. బొమ్మలు కొనటానికి వచ్చిన అక్షరాస్యులు బిత్తర పోయారు, సింగన్నకు ఆరేటు అర్థంకాక అట్టే చూస్తూ..." ఎంత ఇత్తాడంట సారూ!.... ఈ ఎర్రటాయన" - అని ఆంగ్లం తెలిసిన తెలుగువాళ్ళను అడిగాడు.

"ఇరవై!... ఇరవైవేలు ఇస్తాడంటయ్యా.. ఈ పిచ్చోడు" - అంటూ ఆశ్చర్యంతో కూడిన ఎగతాళిని కలబోసుకుని నవ్వాడో పెద్దమనిషి.


అంతే!.... సింగన్నలో ఉన్న 'చిత్ర కళాకారుడు' ఆనందంతో కన్నీటి భాష్పాలు రాల్చాడు. అంతవరకూ కూర్చొని ఉన్న రంగి పురివిప్పిన సంతోషంతో లేచి నిలబడింది. ఇద్దరి ఎదల్లో ఆనందపారవశ్యం రాశి పోసుకుంది. వంద రూపాయల కట్టలు రెండు ఇచ్చాడు విదేశీయుడు.

కట్టలను కళ్ళకు అద్దుకుంటూ రంగి చేతికిచ్చాడు సింగన్న - 'బొమ్మ' ఆంగ్లేయునికి ఇచ్చాడు. ఇచ్చేముందు తన కళను తన్మయత్వంతో చూశాడు.

పిసరంత - 'చీమ'

ఏనుగంత - 'బియ్యపు' గింజను మోసుకొస్తున్న 'బొమ్మ'ను తీసుకున్నాడు విదేశస్తుడు.

"ఇండియా ఈజ్ ద కల్చర్డ్ కంట్రీ!... ద గ్రేటెస్ట్ ఆర్ట్ కంట్రీ" - అనుకుంటూ వెళ్ళిపోయాడు.



12-9-07న ఉదయసాహితి, కరీంనగర్ పక్షాన శ్రీ రామభోజ అంతరంగాలు -నానీలు, శ్రీ సముద్రాల వేణుగోపాలాచార్య సాగర తరంగాలు- నానీలు పుస్తకావిష్కరణ మహోత్సవం జరిగింది. చిత్రంలో ఎడమనుండి కుడికి కె.ఎస్. అనంతాచార్య, శ్రీ రామభోజ, డా॥ఆయాచితం నటేశ్వరశర్మ, శ్రీ సముద్రాల వేణుగోపాలచార్య, శ్రీ దాస్యం సేనాధిపతి, శ్రీ దాస్యంలక్ష్మయ్య, డా॥ బోయినపల్లి వేంకట రామారావు, డా॥ మచ్చ హరిదాసులు ఉన్నారు.